క్లుప్తంగా

19న మండల మీట్

బి.కొత్తకోట: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 19న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శంకరయ్య తెలిపారు. ఉదయం 11 గంటలకు ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు హాజరుకావాలని కోరారు. అధికారులు మండల ప్రగతికి సంబంధించిన నివేదికలు తీసుకురావాలని సూచించారు.

శ్రీరామకోటి పుస్తకాల పంపిణీ



శ్రీరామకోటి పుస్తకాలు పంపిణీ చేస్తున్న వేణుగోపాల్ తదితరులు

గుర్రంకొండ: మండల కేంద్రమైన గుర్రంకొండలో భక్తులకు శ్రీరామకోటి పుస్తకాలను ఉచితంగా పంపిణీ చేశారు. గురువారం స్థానిక ఇందిరమ్మ కాలనీలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఆధ్యాత్మిక గురువులు తిరువీధి వేణుగోపాల్, తిరువీధి శ్రీధర్ ఆధ్వర్యంలో ఉచిత శ్రీ రామకోటి పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తులకు పంపిణీ చేసిన పుస్తకాల్లో శ్రీరామనామాలను పూర్తి రాసి తమకు అందజేయాలన్నారు. ఈ పుస్తకాలన్నింటిని సేకరించి భద్రాచలం లేదా అయోధ్యలోని శ్రీ రామమందిరంలోకి చేరే విధంగా ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సుధాకర్, మల్లయ్య, శ్రీనివాసులు, ప్రభాకరమూర్తి, చింతిర్ల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ సేవా పురస్కారం ప్రదానం



అవార్డు అందుకుంటున్న జి.వి.ఎస్. బాబు

పీలేరు : తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్మన్ డాక్టర్ వెన్నెల గద్దర్ చేతుల మీదుగా గద్దర్ జాతీయసేవా పురస్కారాన్ని పీలేరుకు చెందిన గ్రేట్ విజన్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి.వి.ఎస్. బాబు అందుకున్నారు. అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవం సందర్భంగా కోనసీమ జిల్లా గన్నవరం సాయితేజ జూనియర్ కళాశాల అన్నాబత్తుల రామామణి కళావేదికలో మమత స్వచ్ఛంద సేవా సమితి అధ్యక్షుడు కోరుకొండ జాన్ ఆధ్వర్యంలో అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక సేవా విభాగంలో జి.వి.ఎస్. బాబుకు అవార్డు ప్రదానం చేశారు.

ముసురు వాన

బి.కొత్తకోట: మండలంలో గురువారం తెల్లవారుజాము నుంచి ముసురు వర్షాలు కురుస్తున్నాయి. ఫెంజల్ తుపానుతో రైతులు సాగు చేసిన వరి పంటకు నష్టం వాటిల్లింది. ఇప్పుడు మళ్లీ ముసురుతో వర్షాలు కురుస్తుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బి.కొత్తకోటలో జనసంచారం తగ్గిపోయింది. రోడ్లు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై వర్షం కురుస్తోంది. దీనితో పర్యాటకులు రాకపోకలు స్తంభించాయి. చలి కూడా పెరగడంతో పర్యాటకులు రావడం లేదు.

ఇంటి నిర్మాణ పనులు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఉపేందర్‌రెడ్డి

తంబళ్లపల్లె: మండలంలో పక్కా ఇంటి నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసేందుకు పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సమిష్టిగా కృషి చేయాలని ఎంపీడీఓ ఉపేందర్‌రెడ్డి, హౌసింగ్ డీఈ వెంకటరెడ్డి కోరారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో సమీక్షా సమావేశం జరిగింది. అసంపూర్తిగా ఉన్న ఇంటి నిర్మాణ పనులు గుర్తించి మార్చి నెల 31వ తేదీలోపు పూర్తి చేసే విధంగా చొరవ చూపాలన్నారు. సమావేశంలో ఈఓపీఆర్డీ దిలీప్‌కుమార్, హౌసింగ్ ఏఈ సుజాత, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు అందించిన హెల్పింగ్ మైండ్స్ సభ్యులు

బి.కొత్తకోట: సొంతిళ్లు లేక చెరువులు, రోడ్లపక్కన గుడారాలు వేసుకుని నివసిస్తున్న నిరుపేదలకు బుధవారం రాత్రి మదనపల్లె హెల్పింగ్ మైండ్స్ సభ్యులు దుప్పట్లను పంపిణీ చేశారు. స్థానిక పెద్దచెరువు, బడికాయలపల్లె, చలిమామిడిరోడ్లు, పోలీస్‌స్టేషన్ పరిసరాల్లో నిరుపేదలు గుడారాలు వేసుకుని జీవిస్తున్నారు. చలి తీవ్రం కావడంతో ఇబ్బందులు పడుతున్న వీరి పరిస్థితిని గుర్తించిన హెల్పింగ్ మైండ్స్ సభ్యులు ఫయాజ్, ఆరీఫ్, మహేష్, అబ్దుల్ రెహమాన్, సింహాద్రి, ఇంతియాజ్, దాదు, పోలీస్ కానిస్టేబుళ్లు రమణ, హేమంత్ పేదలకు చలి నుంచి కాపాడుకునేందుకు ఉచితంగా దుప్పట్లు అందించారు.

వీడని వర్షం.. ఆగిన మగ్గం

- కడుపుకొడుతున్న వరుస తుపాన్లు
- పనులు లేక ఇబ్బందులు పడుతున్న నేతన్న
- బూజు పడుతున్న నూలు, జరీ



చేనేత మగ్గం

మదనపల్లె సిటీ: వ్యవసాయం తరువాత చేనేత రంగం అతి పెద్దది. అలాంటి చేనేత రంగంపై కూటమి ప్రభుత్వం అంతంత మాత్రంగానే దృష్టి పెట్టడంతో చేనేత కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మదనపల్లె (నీరుగట్టువారిపల్లె)లో నేతన్నలు అధికంగా ఉన్నారు. సుమారు 15 వేల చేనేత మగ్గాలు ఉండంగా దీనిపై సుమారు 20 వేల మంది ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి జీవిస్తున్నారు. ఇటీవల వరుసగా తుపాన్లతో చేనేతలు కుదేలైపోతున్నారు. ఇటీవల ఫెంగల్ తుపానుతో పది రోజులు పనులు లేక మగ్గాలు మూతపడ్డాయి. గురవారం నుంచి మళ్లీ తుపాను ప్రభావంతో వర్షం ప్రారంభమైంది. దీంతో మళ్లీ మగ్గాల పనులు నిలిచిపోయాయి. జోరున వర్షం కురుస్తుండటంతో నూలు వడకడం, కండి చుట్టడం, నూలు అతకడం, సాపు పట్టడం, చీర నేయడం లాంటి పనులు చేసుకోలేని పరిస్థితి నెలకొంది.

అవస్థలు పడుతున్న కార్మికులు

చేనేత కుటుంబాలలోని వారు పస్తులతో కాలం గడపాల్సి వస్తోంది. వర్షం దెబ్బకు మగ్గం గుంతల్లో నెమ్ము చేరుతుంది. నెమ్ము పూర్తిగా ఆరిపోతే తప్ప గుంతల్లోని దిగి నేత నేసే వీలుండదు. దీనికి తోడు మగ్గంపై వేసిన నూలు, జరీ బూజు పట్టి పనికి రాకుండా పోతున్నాయి. దీంతో నూలు, జరీ ఇచ్చిన యజమానులకు బకాయి పడాల్సి వస్తుంది. నూలు, జరీ తీసుకుని వచ్చిన సమయంలో పది రోజుల్లో యజమానులకు (చీరలు) పూర్తి చేసి అందిస్తామని తెచ్చిన నూలు బూజుపట్టడంతో చీరలు నేయలేని పరిస్థితి ఏర్పడింది. చేనేతకు తగిన పరిహారం అందించి వారిని ఆదుకోవాల్సిన ప్రభుత్వం మిన్నకుండిపోతుండంతో తమకు కష్టాలు తప్పడం లేదని వాపోతున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

పనులు లేవు



వరుస తుపాన్లతో పనులు నిలిచిపోయాయి. గత పది రోజుల క్రితం ఫెంగల్ తుపాన్‌తో పనులు లేక అవస్థలు పడ్డాము. మళ్లీ తుపాను రావడంతో పనులు చేయలేకపోతున్నాం. మగ్గంపైనే ఆధారపడి జీవిస్తున్నాం. పెళ్లిళ్ల సీజన్‌లో వరుస వర్షాలతో పనులు లేక ఇబ్బందులు పడుతున్నాం.

–రాధ, చేనేత కార్మికురాలు, నీరుగట్టువారిపల్లె

ప్రభుత్వం సాయం చేయాలి



వర్షాలతో తీవ్రంగా నష్టపోతున్న చేనేత కార్మికులకు ప్రభుత్వం తక్షణం సాయం అందించాలి. గుంత మగ్గాలు ఉన్న ప్రతి ఒక్క చేనేత కార్మికులు వర్షాలు వచ్చిన ప్రతి సారి ఇలా ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల వరుస తుపాన్లతో నేతన్నలు తీవ్రంగా నష్టపోయారు. వర్షంతో దెబ్బతిన్న వారికి ప్రభుత్వం ఆదుకోవాలి.

–జి.సుధాకర్, చేనేత జనసమాఖ్య అధ్యక్షుడు, మదనపల్లె

మురుగు ఇలా.. పరిశుభ్రత ఎలా?



పెద్దపాళెం వీధిలో ఇళ్ల మధ్యలో మురికి కుంట

గుర్రంకొండ: 'ఎదుటి వారికి చెప్పేటందుకే నీతులు ఉన్నాయి.' ఓ సినీ రచయిత రాసిన ఈ గేయం అచ్చు గుద్దినట్లు గుర్రంకొండ మేజర్ పంచాయతీ అధికారులకు సరిపోతుంది. 'పరిశుభ్రతతోనే ఆరోగ్యం' అని నిత్యం ప్రజలకు హితబోధ చేస్తున్న సదరు అధికారులు, గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణను గాలికి వదిలేశారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో జనవాసాల మధ్యనే మురుగునీరు ప్రవహిస్తోంది. దీనికితోడు ఈగలు, దోమలు స్వైరవిహారం చేస్తుండడంతో జనాలను రోగాల భయం వెంటాడుతోంది. మండల కేంద్రమైన గుర్రంకొండ మేజర్ పంచాయతీలోని పెద్దపాళెం వీధి పరిసరాల్లో ఇళ్ల మధ్యనే మురుగునీటి నిల్వలు పేరుకుపోయాయి. స్థానిక పెద్దపాళెం వీధి, దళితవాడల మధ్యలోని డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో మురుగునీరు బయటకు వెళ్లే మార్గం లేక లో వీధుల్లోనే ప్రవహిస్తోంది. రోజుల తరబడి వీటిని శుభ్రం చేయక పోవడంతో దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే పలువురు జ్వరాల బారినపడ్డారు. ఈ విషయమై పంచాయతీ ఈఓ. శ్రీహరిని వివరణ కోరగా వెంటనే పారిశుద్ధ్య పనులు చేపట్టి సమస్య పరిష్కరిస్తామని పేర్కొన్నారు.



వీధుల్లో ప్రవహిస్తున్న మురుగునీరు

రేపు సాగునీటి సంఘాల ఎన్నికలు

పెద్దమండ్యం: మండలంలోని 6 చెరువులకు సాగునీటి సంఘాల ఎన్నికలు శనివారం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సయ్యద్‌అహ్మద్ గురువారం తెలిపారు. కలిచెర్ల గ్రామ పరిధిలోని పాపిరెడ్డిచెరువు, తిప్పిరెడ్డి చెరువు, లోతువంకచెరువులకు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎన్నికలు జరుగుతాయని చెప్పారు. పాపిరెడ్డిచెరువు జరిగే ఎన్నికలో 102 మంది ఓటర్లు, తిప్పిరెడ్డిచెరువుకు జరిగే ఎన్నికలో 88 మంది ఓటర్లు, లోతువంకచెరువు జరిగే ఎన్నికలో 139 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకొంటారని తెలిపారు. అలాగే పెద్దమండ్యం పంచాయతీ పరిధిలోని లంపవంకచెరువుకు పెద్దమండ్యం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎన్నిక జరుగుతుందని తెలిపారు. 92 మంది ఓటర్లు ఎన్నికల్లో తమ ఓటుహక్కును వినియోగించుకుంటారని పేర్కొన్నారు. అలాగే శిద్దవరం చెరువుకు జరిగే ఎన్నికలో 197 మంది, వెలిగల్లు పెద్దచెరువుకు జరిగే ఎన్నికలో 242 మంది తమ ఓటుహక్కును వినియోగించు కొంటారని తెలిపారు.

పీలేరురూరల్ : మండలంలోని సాగునీటి సంఘాల ఎన్నికలు శనివారం నిర్వహిస్తామని తహసీల్దార్ ఎం. భీమేశ్వర్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని అయ్యపునాయునిచెరువుకు కోటపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాల, సూరప్పచెరువుకు గూడరేవుపల్లె జెడ్పీ హైస్కూల్, చింతలచెరువుకు దొడ్డిపల్లె గ్రామ సచివాలయం నందు వినియోగదారుల సంఘం ఎన్నికలు శనివారం జరుగుతాయన్నారు.

రామసముద్రం : మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికలు శనివారం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ నిర్మలాదేవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని సందూరిచెరువు, వడ్డివానిచెరువు, కనగానిచెరువు, ఉప్పినెల్లి చిన్నచెరువు, ఊలపాడుచెరువు, గొల్లపల్లె చెరువు, అగ్రహారం చెరువు, పాయి చెరువులకు సాగునీటి వినియోగదారుల సంఘం ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నిమ్మనపల్లె : మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికలు శనివారం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ధనుంజయులు తెలిపారు. మండలంలోని ముష్టూరు పంచాయతీలోని బహుదా రిజర్వాయర్ ప్రాజెక్ట్, నిమ్మనపల్లె కుమార అహోబిలనాయుని చెరువు, తవళం కోమటివాని చెరువు, కొండవంక చెరువులకు సాగునీటి వినియోగదారుల సంఘం ఎన్నికలు జరుగుతాయన్నారు. శనివారం నిమ్మనపల్లి జెడ్పీ హైస్కూల్‌లో ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికల ప్రక్రియ జరుగుతుందన్నారు. ఎన్నికల్లో ఆయకట్టు రైతులు ఓటర్లుగా ఉంటారన్నారు. ఓటు హక్కు వినియోగించుకునే రైతులు ముందుగా నీటి తీరువా చెల్లించి ఉండాలన్నారు. సాగునీటి సంఘాల ఎన్నిక సజావుగా జరిగేలా పోలింగ్ కేంద్రం వద్ద గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలి



మాట్లాడుతున్న టూరిజం డిపార్ట్‌మెంట్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రమణప్రసాద్

పీలేరురూరల్ : పర్యావరణానికి నష్టం కలగకుండా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయాలని టూరిజం డిపార్ట్‌మెంట్ రీజనల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రమణప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక ఎస్‌జీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పర్యావరణ పర్యాటకం, స్థిరమైన అభివృద్ధి, పోకడలు, అవకాశాలు, సవాళ్ల అంశంపై ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్, న్యూఢిల్లీ వారి ఆర్థిక సహకారంతో జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటక రంగంలో ఉన్న అవకాశాలు యువత అందిపుచ్చుకోవాలని సూచించారు. పాండిచ్చేరి విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ వై. వెంకటరావు మాట్లాడుతూ పర్యావరణ పర్యాటకం 1990 నుంచి 30శాతం వరకు అభివృద్ధి నమోదు చేసి ప్రపంచ తలసరి ఆదాయానికి ఆరు శాతానికి పెంచడం సాధ్యమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. సుధాకర్, కన్వీనర్ లెఫ్టినెంట్ డాక్టర్ వెంకటరమణయ్య, గుల్బర్గా కేంద్రీయ విశ్వవిద్యాలయం వాణిజ్య శాస్త్ర ఆచార్యులు గంగినేని రంగనాథం, వైస్ ప్రిన్సిపాల్ శివరామిరెడ్డి పాల్గొన్నారు.

రేపు తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: పౌర్ణమి పురస్కరించుకుని శనివారం తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఉదయం 9 గంటలకు అల్ట్రాడీలక్స్ బస్సులు డిపో నుంచి బయలుదేరుతాయని పేర్కొన్నారు. తిరువణ్ణామలైకి రానుపోను ఒక్కొక్కరికి రూ.805 చెల్లించాలన్నారు.

ప్రైవేటు ఆసుపత్రుల తనిఖీ



ప్రైవేటు ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న ఏడీఎంహెచ్ఓ డాక్టర్ శైలజ

మదనపల్లె: పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రిలను జిల్లా ఏడీఎంహెచ్ఓ డాక్టర్ శైలజ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రులతో పాటు , స్కాన్ సెంటర్లు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలోని టీబీ, ఎచ్.ఐ.వి, బ్లడ్ బ్యాంక్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కమిషనర్ ఆఫ్ ఫ్యామిలీ వెల్ఫేర్ శాఖ ఆదేశాలతో పట్టణం లో వివిధ ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రులతో పాటు స్కాన్ సెంటర్లను తనిఖీ చేశామన్నారు. ఈ సందర్భంగా సంబంధిత సిబ్బంది కి తగు సలహాలు సూచనలు ఇచ్చామన్నారు. ప్రతి ఆసుపత్రిలో బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ నిర్వహణలో ప్రమాణాలు పాటించాలన్నారు. అనంతరం ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలోని రిజిస్టర్‌లను పరిశీలించారు. ఓపీకి వస్తున్న పేషంట్‌లలో క్షయ లక్షణాలు ఉన్నవారిని గుర్తించాలన్నారు. సూపర్‌వైజర్‌లు దయాలన్, ఎస్.ప్రభాకర్, శాంతి పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న జయశ్రీ

కురబలకోట: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని చెన్నైలోని ఫెమీ–9 రుతుసంబంధ అధ్యాపకురాలు జయశ్రీ అన్నారు. గురువారం అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో రుతు పరిశుభ్రత నిర్వహణపై విద్యార్థినులకు జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఇంటికి దీపం ఇల్లాలే.. మహిళలు బాగుంటే సమాజం బాగుంటుందన్నారు. రజస్వల అయినప్పటి నుంచి ప్రతి నెలా మహిళలు ఎదుర్కొనే ప్రధాన సమస్య రుతుక్రమమన్నారు. ఇది సహజ ప్రక్రియ అయినా వారికి తలనొప్పిలాంటిదన్నారు. ఆడవాళ్లకు చెప్పుకోలేని ఆరోగ్య సమస్యలు ఎన్నో ఉన్నాయని తెలిపారు. రీసోర్సు పర్సన్ అనంత్ మాట్లాడుతూ వయసు పెరిగే కొద్ది ఆరోగ్య సమస్యలు ఎక్కువ అవుతాయన్నారు. రక్తహీనత, వివిధ రకాల నొప్పులు బారిన పడతారని పేర్కొన్నారు. ప్రధానంగా సరైన సమతుల పోషకాహారం తీసుకోవడంతో పాటు కొద్దిపాటి ముందు జాగ్రత్తలు పాటిస్తే చాలా సమస్యలు దూరమవుతాయని తెలిపారు.

మోహన్‌బాబును అరెస్ట్ చేయాలి



సబ్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న జర్నలిస్టులు

మదనపల్లె : సినీనటుడు మోహన్‌బాబుకి ఇచ్చిన పద్మశ్రీ బిరుదును వెనక్కి తీసుకోవడంతో పాటు తక్షణమే అతడిని అరెస్ట్ చేసి, హత్యాయత్నం కేసు నమోదు చేయాలని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యూజే) రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ బండపల్లి అక్కులప్ప, జిల్లా కార్యదర్శి వంశీధర్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు రమేష్ రాయల్ డిమాండ్ చేశారు. హైదరాబాద్ టీవీ9 విలేకరి రంజిత్‌పై దాడికి నిరసనగా మదనపల్లె సబ్ కలెక్టరేట్ ఎదుట ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం సబ్ కలెక్టరేట్‌లో డీటీ కుమారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ బండపల్లి అక్కులప్ప మాట్లాడుతూ మోహన్‌బాబుకు కుటుంబసభ్యులు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లాక వారి వ్యవహారంలో మీడియా జోక్యం చేసుకుందన్నారు. జర్నలిస్టులతో వీధి రౌడీల్లా వ్యవహరించిన ఆయనను మా మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులు వాసు, కిరణ్‌కుమార్, శ్రీధర్‌బాబు, శ్రీనివాసగౌడ్, శ్రీనివాసులు, ప్రసాద్, గంగాధర, రవి, సురేష్ పాల్గొన్నారు.

అనాథ దివ్యాంగుడిని ఆదుకోండి

పీలేరురూరల్ : పీలేరు పట్టణం స్థానిక బోదేషావలి దర్గాలో ఓ అనాథ దివ్యాంగుడు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ దుర్భర జీవితాన్ని గడుపుతున్నాడు. పీలేరు పట్టణానికి చెందిన జీవా అనే యువకుడు దివ్యాంగుడు. అతడిని బంధువులు పట్టించుకోకపోవడంతో ఆయన కొంత కాలంగా స్థానిక బోదేషావలి దర్గాలో ఓ పట్టతో గుడిసె ఏర్పాటు చేసుకుని నివాసం ఉంటున్నాడు. ఎవరైనా దాతలు, ప్రభుత్వ అధికారులు తనను ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

రెవెన్యూ సదస్సులతో రైతులకు మేలు



మదనపల్లె : ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే



పీలేరు : అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు



పెద్దతిప్పసముద్రం: అధికారులకు వినతిప్రతం అందజేస్తున్న గ్రామస్తులు

మదనపల్లె : రెవెన్యూ సదస్సుల్లో రైతులు భూ సమస్యలను పరిష్కించుకోవాలని, ఈ సదస్సులు రైతులకు ఎంతో ఉపయోగపడుతాయని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. గురువారం మండలంలోని సీటీఎం–1 పంచాయతీలో సర్పంచ్ ఆనంద పార్థసారథి అధ్యక్షతన రెవెన్యూ సదస్సు జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ సదస్సులో రైతులు సమర్పించిన ప్రతి సమస్యకు అధికారులు రసీదుతో పాటు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారన్నారు. ఒక వేళ సమస్య పరిష్కారం కాకపోతే, దానికి కారణాలను అర్జీదారుడికి తెలియజేస్తారన్నారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్, డీఎల్‌డీఓ అమరనాథరెడ్డి, డీటీ అస్లాంబాషా, వీఆర్వో జాన్సన్‌ప్రదీప్, నాయకులు వెలుగుచంద్ర తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం

పేదల సొంతింటి కల సాకారం చేశామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. మున్సిపాలిటీలోని టిడ్కో గృహాల లబ్ధిదారులకు గురువారం తాళాలు అందజేశారు. మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.

దేవాదాయ భూమిని కాపాడండి

పెద్దతిప్పసముద్రం: అన్యాక్రాంతమైన దేవాదాయ భూమిని కాపాడాలని తుమ్మరకుంట గ్రామ ప్రజలు గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో అర్జీ పెట్టుకున్నారు. సర్వే నంబర్ 1,143లో శ్రీ మల్లేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన 5.36 ఎకరాల భూమిని దొడ్డిదారిలో ఓ భూస్వామి ఆక్రమించుకున్నారని, దేవాదాయ భూమిని కాపాడాలని కోరారు. అర్జీపై ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి కరుణాకర్, తహసీల్దార్ శ్రీరాములు నాయక్ దేవదాయ శాఖ అధికారులను ఆదేశించారు. డిప్యూటీ తహసీల్దార్ ధనంజనేయులు, మండల సర్వేయర్ శ్రీవాణితో పాటు వీఆర్‌ఓలు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బి.కొత్తకోట: మండలంలోని సూరపువారిపల్లెలో గురువారం రెవెన్యూ సదస్సును అధికారులు నిర్వహించారు. గ్రామానికి చెందిన రైతులు, ప్రజలు వివిధ సమస్యలపై వినతులు అందించారు. అందులో ఒకరు రెవెన్యూ అధికారులు తమ భూమిని మరొకరి పేరుతో ఆన్‌లైన్ చేశారని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. 109 వినతులు అందుగా అందులో అధికంగా రెవెన్యూకు సంబంధించిన సమస్యలే ఉన్నాయి. తహసీల్దార్ మొహమ్మద్ అన్సారీ, సర్వేయర్ ముబారక్, వీఆర్‌ఓ వెంకటరమణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించుకోవాలి

పెద్దమండ్యం: రెవెన్యూ సదస్సుల్లో రైతులు తమ సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ సయ్యద్ అహ్మద్ అన్నారు. మండలంలోని దిగువపల్లెలో గురువారం గ్రామ సర్పంచ్ బండి వాసవి అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ సమస్యల పరిష్కారం కోసం తహసీల్దార్‌కు అర్జీలు ఇచ్చారు. అలాగే పింఛన్లు, ఇతర సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సదస్సులో అధికారులు స్వీకరించారు. రెవెన్యూ సదస్సుల్లో రైతులు తమ సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రమేష్, వీఆర్‌ఓలు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విశేష స్పందన

రామసముద్రం : రామసముద్రం మండలం కుదురుచీమనపల్లెలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నిర్మలాదేవి మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులకు విశేష స్పందన లభిస్తోందన్నారు. ఏమైనా రెవెన్యూ సమస్యలు ఉన్న ప్రతి రైతు అర్జీలు సమర్పించి పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ నాగరాజు, రమణ, వీఆర్‌ఓ మల్లికార్జున, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి

పీలేరు : రైతుల భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ప్రత్యేకాధికారి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎస్. రమ అన్నారు. గురువారం స్థానిక బోడుమల్లువారిపల్లె గ్రామ సచివాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సదస్సులో మొత్తం 40 అర్జీలు వచ్చాయని, ప్రతి అర్జీని ఆన్‌లైన్ చేసి గడువులోపు పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ భరత్‌కుమార్‌రెడ్డి, తహసీల్దార్ భీమేశ్వర్‌రావు, సర్వేయర్ కిరణ్మయి, వీఆర్‌ఓ సిద్దయ్య, పంచాయతీ కార్యదర్శి హరిప్రసాద్ మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లె: మండలంలోని గుండ్లపల్లి గ్రామ సచివాలయంలో గురువారం రెవెన్యూ సదస్సు జరిగింది. ప్రజల నుంచి పది సమస్యలపై అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ హరికుమార్ తెలిపారు. అర్జీలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి రసీదులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఏఈఎస్ జోగేంద్ర, ఎఫ్‌బీఓ రామ్‌రాజ్, దేవాదాయశాఖ రికార్డు అసిస్టెంట్ కొండ కిట్ట పాల్గొన్నారు.

సమస్యలపై వినతులు

బి.కొత్తకోట: మండలంలోని సూరపువారిపల్లెలో గురువారం రెవెన్యూ సదస్సును అధికారులు నిర్వహించారు. గ్రామానికి చెందిన రైతులు, ప్రజలు వివిధ సమస్యలపై వినతులు అందించారు. అందులో ఒకరు రెవెన్యూ అధికారులు తమ భూమిని మరొకరి పేరుతో ఆన్‌లైన్ చేశారని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. 109 వినతులు అందుగా అందులో అధికంగా రెవెన్యూకు సంబంధించిన సమస్యలే ఉన్నాయి. తహసీల్దార్ మొహమ్మద్ అన్సారీ, సర్వేయర్ ముబారక్, వీఆర్‌ఓ వెంకటరమణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హోంగార్డులు క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి

మదనపల్లె : హోంగార్డులు క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని కర్నూలు రీజనల్ హోంగార్డ్స్ కమాండెంట్ ఎం.మహేష్ కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని బీటీ కాలేజ్ మైదానంలో హోంగార్డుల పరేడ్‌ను ఆయన తనిఖీ చేసి, దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమాండెంట్ మహేష్ కుమార్ మాట్లాడుతూ పోలీస్ శాఖలో హోంగార్డుల సేవలు అభినందనీయమని, క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించి, మంచి పేరు తీసుకురావాలన్నారు. హోంగార్డుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. విధులు అనేక సవాళ్లు ఉంటాయని, ఇలాంటి పరిస్థితుల్లో ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఆరోగ్యంగా ఉన్నపుడే సమర్థవంతంగా విధులు నిర్వహించడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. హోంగార్డ్స్ కర్నూల్ రేంజ్ డీఎస్పీ కే.వీ.ఎస్. ప్రసాద్ మదనపల్లి ఇన్‌చార్జి రమేష్ పాల్గొన్నారు.

సీల్డ్ కవర్ల వ్యవహారంపై విచారణ

మదనపల్లె : జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు ప్రైవేట్ స్కానింగ్ సెంటర్ల నుంచి సీల్డ్ కవర్లు అందుకుంటున్న విషయమై గురువారం సబ్ కలెక్టర్ మేఘ స్వరూప్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా విచారణ నిర్వహించారు. పేదలకు వైద్యసేవలు అందించాలే తప్ప వారిని దోపిడీ చేయడమేంటని ప్రశ్నించారు. జిల్లా ఆస్పత్రిలో రెఫర్లు అధికంగా జరుగుతున్నాయని, సిబ్బంది ప్రజలతో దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని, వైద్యులు పనితీరు మార్చుకోవాలన్నారు. దీనిపై మెడికల్ సూపరింటెండెంట్ గాయత్రి వివరణ ఇస్తూ... మీడియా ప్రతినిధులు జిల్లా ఆస్పత్రిలో సిబ్బందిని ఇబ్బందులు పెడుతున్నారని, ఐసీయూ, పేషెంట్ వార్డుల్లో అనుమతి లేకుండా ఫోటోలు, వీడియోలు తీస్తూ విధులకు ఆటంకం కలిగిస్తున్నారని చెప్పుకొచ్చారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ... సమస్యను పెంచుకుంటూ పోతే మరింత జటిలమవుతుందని, వైద్యుల కాల్‌హిస్టరీ, పోలీస్ ఎంక్వయిరీ వేస్తే దోషులెవరో తేలిపోతుందన్నారు. జిల్లా ఆస్పత్రి వైద్య సిబ్బంది బాధ్యతతో పనిచేసి, మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు.